## 15వ పాఠం

# కీడు నుండి రక్షణకై తాయెత్తులు, కడియాలు, రక్షరేకులు ధరించటం

మహోన్నతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**(ఓ ప్రవక్తా ముహమ్మద్!) ఆకాశాలను, భూమినీ సృష్టించినది ఎవరు? అని నువ్వు గనక వారిని (మక్కా బహుదైవారాధకులను) అడిగితే, "అల్లాహ్" అని వారు తప్పకుండా చెబుతారు. వారితో చెప్పు: "సరే! చూడండి. మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పిలుస్తున్నారో వారు, అల్లాహ్ మీకేదన్నా కీడు చెయ్యదలిస్తే, ఆ కీడును తొలగించగలరా? పోనీ, అల్లాహ్ నన్ను కటాక్షించదలిస్తే, వారు ఆయన కృపను అడ్డుకోగలరా?" ఇలా అను: "నాకు అల్లాహ్ చాలు. నమ్మేవారు ఆయన్నే నమ్ముకుంటారు."** ***(ఖుర్ఆన్ 39 : 38)***

ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం) ఒకసారి, తన చేతికి ఇత్తడి కడియాన్ని ధరించి, తన దగ్గరకు వచ్చిన ఒక వ్యక్తిని చూసి 'ఏమిటిది?' అని అడిగారు. దానికావ్యక్తి, 'బలహీనత (వాహినా) కారణంగా దీన్ని తొడిగాన'ని అన్నాడు. అప్పుడాయన (స), "దీనిని తీసెయ్యి దీనివల్ల (నీకెలాంటి లాభం కలగదు సరికదా) నీ బలహీనత మరింత పెరుగుతుంది. అది తొడిగి ఉండి నువ్వు గనక మరణిస్తే నువ్వు సాఫల్యం (మోక్షం) పొందలేవు' అని ఉద్బోధించారు." (ముస్నదె అహ్మద్– ప్రామాణిక పరంపరతో అందిన హదీసు)

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "తాయెత్తులు ధరించేవారి కార్యములను అల్లాహ్ నెరవేర్చకుండుగాక! సముద్రపు శంఖ (గవ్వ)లను మాలగా వ్రేలాడదీసు కునే వారికి సుఖశాంతులు ప్రాప్తించకుండుగాక!!" (ముస్నదె అహ్మద్)

https://teluguislam.net

వేరొక హదీసులో దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు: "తాయెత్తు వ్రేలాడదీసేవాడు షిర్క్ (బహుదైవోపాసన)కు ఒడిగట్టినట్లే."

(ముస్నదె అహ్మద్)

హుజైఫా (రజి) గారి గురించి ఇబ్నె అబీ హాతిం ఇలా ఉల్లేఖించారు: "ఒక వ్యక్తి అనారోగ్యం కారణంగా తన చేతికి దారం చుట్టుకుని ఉండటం చూసి ఆయన (హుజైఫా) దాన్ని త్రెంచేసి ఈ ఆయత్ పఠించారు–

**"వారిలో చాలామంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతున్నారు"**

***(ఖుర్ఆన్ 12 : 106)***

## ఈ పాఠంలోని ముఖ్యాంశాలు

- కీడు నుంచి రక్షణ పొందటానికి కడియాలు, దారాలు, తాయెత్తులు తొడగటం ముమ్మాటికీ నిషిద్ధం.
- ఒకవేళ దైవప్రవక్త సహచరులు (సహాబా) అయినా సరే వాటిని తొడిగిన స్థితిలో మరణం సంభవిస్తే వారు కూడా మోక్షం పొంద జాలరు. ఆ విషయం వారికి తెలుసు కాబట్టి వారు ఏనాడూ అలాంటి తప్పులు చేయలేదు. "చిన్న షిర్క్ పెద్ద పాపాల (కబాయిర్) కన్నా కూడా ఘోరమైనది" అన్న ప్రవక్త సహచరుల మాటను ఈ విషయం మరింత బలపరుస్తోంది.
- ఈ వ్యవహారంలో అజాగ్రత్త, అలసత్వం క్షమార్హం కాదు.
- ఈ రకమయిన వస్తువులు ధరించటం వల్ల ప్రాపంచిక జీవితంలోనూ ఎలాంటి లాభం కలగదు సరికదా మరింత నష్టం (కీడు) వాటిల్లుతుంది. ఎందుకంటే, "ఇది నీ బలహీనతను మరింత పెంచుతుంది" అని దైవప్రవక్త (స) చెప్పనే చెప్పారు.
- ఎవరైనా ఇలాంటి వెకిలిచేష్టలకు పాల్పడితే వారినిగట్టిగా

https://teluguislam.net

వారించాలి.

- ఇలాంటి వస్తువును వ్రేలాడదీసినవాడు దానికే అప్పగించబడతాడు. అంటే అలాంటివారిని రక్షించే బాధ్యత అల్లాహ్ తీసుకోడు.
- తాయెత్తులు, దారపు పోగులు ధరించినవాడు ఖచ్చితంగా షిర్క్‌కు పాల్పడినట్లే.
- హుజైఫా (రజి) పఠించిన ఖుర్ఆన్ సూక్తిని బట్టి ప్రవక్త సహచరులు పెద్ద షిర్క్‌కు ఉద్దేశించిన సూక్తిని చిన్న తరహా షిర్క్‌ను ఖండించటానికి కూడా పఠించేవారన్న దానికి స్పష్టమైన ఆధారం లభిస్తోంది. ఇబ్నె అబ్బాస్ (రజి) గారు సయితం అల్ బఖర సూరాలోని ఆయతు (2:165)ను పఠించి ఉన్నారు.
- జ్వరం నుంచి ఉపశమనానికి, దిష్టి నుంచి విరుగుడుకు గాను తాయెత్తులు, రక్షరేకులు వాడటం కూడా షిర్క్ క్రిందికే వస్తుంది. వాటికి బదులు ఖుర్ఆన్ ఆయతులు, ప్రవక్త (స) దుఆలు పఠించటం ఉత్తమం, శ్రేయస్కరం.
- తాయెత్తులు, రక్షరేకులు ధరించేవారు శపించదగినవారు. వారి తలంపులను అల్లాహ్ పూర్తి చేయడు. గవ్వలు ధరించే వారికి సుఖ సౌఖ్యాలు కూడా ప్రాప్తించవు.ఎందుకంటే అల్లాహ్ అలాంటి వాళ్ళను రక్షించకుండా వాళ్ళ మానాన వదలివేస్తాడు. అల్లాహ్ వదలివేసిన వారిని మరెవరూ రక్షించలేరు.

## మోడల్ ప్రశ్నలు

1) తాయెత్తుల గురించి ప్రవక్తగారు ఏమన్నారు?
2) జ్వరం, దిష్టి మొదలగు వాటి విరుగుడు గురించి ఉత్తమ మార్గం ఏది?
3) తాయెత్తులు ధరించడం ఎంత పెద్ద పాపం? అది షిర్క్‌లోని ఏ కోవకు చెందుతుంది.

https://teluguislam.net